# జాగ్రత్తలు పాటిస్తేనే అధిక దిగుబడి

- సొంత నిర్ణయాలు తగదు
- భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించాలి
- పంట పరిస్థితిని ప్రతిరోజూ పరిశీలించాలి
- అధికారుల సలహాలు, సూచనల మేరకే ఎరువులు, మందులు వాడాలి

వరి పంటకు మందు చల్లుతున్న రైతు



జిల్లావ్యాప్తంగా పెద్దఎత్తున వరి పంటలను సాగు చేసుకుంటున్నారు. సొంత నిర్ణయాలతో పంటకు ఇష్టానుసారంగా ఎరువులు చల్లి పంటల పెట్టుబడి ఖర్చులు పెంచుకుంటున్నారు. వరిసాగులో సరైన యాజమాన్య పద్ధతులు పాటించాలి. అధికారుల సూచనల మేరకు పంటలకు ఎరువులను అందజేస్తూ అధిక దిగుబడులు సాధించుకోవచ్చునని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. భూసార పరీక్షల ఫలితాలకనుగుణంగా ఎరువులు వాడినప్పుడే మంచి ఫలితాలు వస్తాయి. రైతులు అధికారుల సూచనల మేరకే పంటలకు మందులు వాడాలని వ్యవసాయశాఖ ఏడీఏ సత్యనారాయణ తెలిపారు.
- ఇబ్రహీంపట్నంరూరల్, జూలై 23

### సకాలంలో భాస్వరం అందించాలి

మొక్కల వేర్ల పెరుగుదలకు పోషక పదార్థంగా భాస్వరం ఉపయోగపడుతుంది. దీనిని నాటువేసే ముందు దమ్ములో, నాట్లు వేసిన 15 రోజుల్లోపు కాంప్లెక్స్ ఎరువుగా వాడాల్సి ఉంటుంది. భాస్వరం కలిగిన కాంప్లెక్స్ ఎరువులను పైపాటుగా వేయరాదు. నత్రజని ఎరువుల బురద పదునులో వేసి తర్వాత నీరు పెట్టాలి. యూరియా చల్లిన 48 గంటల తర్వాత తప్పనిసరిగా పంటకు నీటిని అందజేయాలి.

### మూడు విడతల్లో యూరియా చల్లాలి

వరి పైరు పెరిగేందుకు నత్రజని ఎంతగానో దోహదపడుతుంది. నత్రజనిని కాంప్లెక్స్ ఎరువుల రూపంలోగాని, యూరియా రూపంలోగాని వాడొచ్చు. దీనిని మూడు దఫాలుగా పొలంలో చల్లాలి. నాట్లు వేసే ముందు, దుబ్బు చేసే దశలో, అంకురం ఏర్పడే దశలో నత్రజనిని అందించే ఎరువులను వాడుకోవాలి. నత్రజని పోషకాన్ని సరైన మోతాదులో అందించేందుకు యూరియా వాడే విధానంపై రైతులు దృష్టి సారించాలి. ఎకరానికి 25 నుంచి 32 కిలోల నత్రజని అందిచాలంటే 55 నుంచి 70 కిలోల యూరియాను పొలంలో చల్లుకోవాలి. దీనిని మూడు సమాన భాగాలుగా విభజించి చల్లుకోవాల్సి ఉంటుంది. పైరు పెరుగుదల ఆశించిన స్థాయిలో లేకుండా అదనంగా 10 నుంచి 15 కిలోల వరకు యూరియా వాడొచ్చు. లేదంటే 50 కిలోల యూరియాకు 10 కిలోల వేపపిండి లేక 250 కిలోల తేమ కలిగిన మట్టిని కలిపి రెండు రోజులు నిల్వ ఉంచి వెదజల్లితే నత్రజని వినియోగం పెరుగుతుంది. యూరియా అధిక వినియోగంతో అనేక అనర్థాలు ఎదురవుతాయి.

### జింకు ధాతు లోపం లేకుండా..

సాధారణంగా జింకు లోపం చలికాలం, చౌడు పొలాల్లో, మురుగు సమస్య ఉండే పంట చేళ్లలోనూ కనిపిస్తుంది. వరి నాటిన 2 నుంచి 4 వారాల్లో జింకు లోపం కనిపిస్తుంది. ముదురాకు చివర తుప్పు మచ్చలు ఏర్పడి, ఆకులు పెలుసుగా తయారవుతాయి. జింకు లోపం నివారణకు 20 కిలోల జింకు సల్ఫేటు, ఎకరానికి చివరి దమ్ములో వేయాలి. లేకపోతే 0.2 శాతం జింకు సల్ఫేటును, నాలుగైదు రోజులకొక్కసారి రెండు, మూడు పర్యాయాలు పైరు ఆకులు తడిచేటట్లు పిచికారీ చేయాలి. జింకు సల్ఫేటును ఎలాంటి పురుగు, తెగుళ్ల మందులతో కలిపి పిచికారీ చేయొద్దు. జింకు సల్ఫేటు పిచికారీ చేసిన తర్వాత 25-30 కిలోల యూరియా ఎకరానికి పైపాటుగా వేయాలి.

### సరైన జాగ్రత్తలు పాటించాలి



రైతులు ప్రతిరోజూ తమ వ్యవసాయ పొలానికెళ్లి పంట పరిస్థితిని పరిశీలించాలి. అనుమానం వచ్చిన వెంటనే స్థానికంగా వ్యవసాయ రైతు వేదికల్లో ఉండే అధికారులను సంప్రదించి వారి సలహాలు, సూచనలతో మందులను వాడి సమస్యను పరిష్కరించుకోవాలి. వరిలో ఇనుము లోపం కూడా రావచ్చు. నివారణకు 20-30 గ్రాముల అన్నభేది చూర్ణం లేక మూడు గ్రాముల నిమ్మ ఉప్పు లీటరు నీటిలో కలిపి పైరు బాగా తడిచేలా పిచికారీ చేయాలి. రైతులు ఎప్పుడు కూడా సొంత నిర్ణయాలు తీసుకోకుండా అధికారుల సూచనలు తప్పనిసరిగా పాటించాలి.

- శ్రావణ్‌కుమార్, వ్యవసాయ విస్తరణాధికారి, ఇబ్రహీంపట్నం



శిక్షణలో పాల్గొని మాట్లాడుతున్న కలెక్టర్ ప్రతీక్‌జైన్

# అంగవైకల్య రహిత సమాజాన్ని నిర్మిద్దాం

- మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి వాకాటి కరుణ
- ఆరేండ్లలోపు పిల్లల్లో పుట్టుకతో వచ్చే లోపాలను గుర్తించడానికి అంగన్‌వాడీ, ఆశాలకు శిక్షణ
- పైలట్ ప్రాజెక్టుగా ఎంపికైన బొంరాస్‌పేట మండలం ఎంపిక

బొంరాస్‌పేట, జూలై 24 : ఆరేండ్లలోపున్న చిన్న పిల్లల్లో పుట్టుకతో వచ్చే లోపాలను ముందుగానే గుర్తించి సకాలంలో చికిత్స అందిస్తే వారిని మామూలు స్థితికి తీసుకురావచ్చని.. తద్వారా అంగవైకల్య రహిత సమాజాన్ని నిర్మించడానికి అవకాశం ఉంటుందని మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి వాకాటి కరుణ అన్నారు. ఆరేండ్లలోపు పిల్లల్లో పుట్టుకతో వచ్చే లోపాలను గుర్తించడానికి పైలట్ ప్రాజెక్టుగా ఎంపికైన బొంరాస్‌పేట మండలం ఎంపికైంది. లోపాల గుర్తింపునకు మండల కేంద్రంలోని రైతు వేదికలో అంగన్‌వాడీ, ఆశాలకు నిర్వహిస్తున్న శిక్షణను ఉద్దేశించి ఆమె బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. సర్వే ద్వారా లోపాలను గుర్తించడమనేది చాలా ముఖ్యమని, ఇంటింటి సర్వే చేసే క్రమంలో క్షేత్రస్థాయిలో సిబ్బంది ప్రతి బిడ్డనూ క్షుణ్ణంగా పరిశీలించి వైకల్యాలను నమోదు చేయాలన్నారు. అంగవైకల్యంతో పాటు శారీరక మానసిక రుగ్మతలను కూడా గుర్తించి అవసరమైన చికిత్సలను చేయించడం జరుగుతుందన్నారు. వెనుకబడిన బొంరాస్‌పేట మండలాన్ని ప్రభుత్వం పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిందని.. మండలానికి ఇలాంటి కార్యక్రమం ఎంతో ప్రయోజనం కలిగిస్తుందని కరుణ పేర్కొన్నారు.

### పకడ్బందీగా సర్వే నిర్వహించాలి

వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్ మాట్లాడుతూ.. పిల్లల్లో పుట్టుకతో వచ్చే సమస్యలను ముందుగానే గుర్తిస్తే చికిత్స ద్వారా వాటిని నయం చేయడానికి అవకాశం ఉంటుందని, పేదరికంతో ఉండే కుటుంబాలకు ఇలాంటి సర్వే మూలంగా ఎంతో లబ్ధి కలుగుతుందన్నారు. ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ కూడా పుట్టుకతోనే సమస్యతో జన్మించారని.. అయినా కూడా నోబుల్ బహుమతి అందుకున్నారని కలెక్టర్ అన్నారు. ప్రభుత్వం బొంరాస్‌పేట మండలాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిందని.. ఇక్కడ మంచి ఫలితాలు వస్తే తరువాత జిల్లా అంతటా ఈ కార్యక్రమాన్ని విస్తరిస్తుందన్నారు. ప్రతిరోజూ ఐదు ఇండ్లను సర్వే చేయాలని, ఆదరాబాదరగా కాకుండా పకడ్బందీగా సర్వే చేయాలని సూచించారు. అంగన్‌వాడీ టీచర్లకు ఏమైనా ఇబ్బందులున్నాయా, కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్, మరుగుదొడ్ల సౌకర్యం ఉందా అని అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు రంగులు వేయడానికి నిధులిచ్చామన్నారు.

### మన పిల్లలుగా భావించాలి

అసిస్టెంట్ కలెక్టర్ ఉమాహారతి మాట్లాడుతూ.. లోపాలు ఉన్న పిల్లలు కూడా మన పిల్లలుగానే భావించి సర్వేను నిర్వహించాలన్నారు. సర్వే నిర్వహణపై అధికారులు శిక్షణ ఇచ్చారు. కలెక్టర్‌తోపాటు కొంత మంది అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలతో ఆమె మాట్లాడారు. సర్వేను విజయవంతంగా నిర్వహించాలన్నారు.

మండలంలోని బొంరాస్‌పేట, తుంకిమెట్ల, నాందార్‌పూర్ గ్రామాల్లోని పాఠశాలలను కలెక్టర్ తనిఖీ చేశారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా చేపట్టిన పనులను పరిశీలించారు. బొంరాస్‌పేట రైతు వేదిక ఆవరణలో కలెక్టర్, అసిస్టెంట్ కలెక్టర్ మొక్కలు నాటారు.

కార్యక్రమంలో డీఎంహెచ్‌వో పల్వాన్‌కుమార్, డిప్యూటీ డీఎంహెచ్‌వో రవీంద్రయాదవ్, మండల వైద్యాధికారి హేమంత్‌కుమార్, ఎంపీడీవో వెంకన్‌గౌడ్, పల్లె దవాఖాన వైద్యులు అక్షయ్‌కుమార్, హర్షవర్ధన్, నవ్యశ్రీ, సౌమ్యారాణి, సీహెచ్‌వో శివరాజ్, హెల్త్ ఎడ్యుకేటర్ రాజేశ్వరి, సూపర్‌వైజర్లు మణిమాల, నిరంజనమ్మ పాల్గొన్నారు.


# స్మితా సబర్వాల్ వ్యాఖ్యల వెనుక ప్రభుత్వ కుట్ర

- వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య
- ఇబ్రహీంపట్నంలో స్మితాసబర్వాల్ దిష్టిబొమ్మ దహనం



ఇబ్రహీంపట్నంలో స్మితాసబర్వాల్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న దివ్యాంగుల సంఘం నాయకులు

ఇబ్రహీంపట్నం, జూలై 24 : దివ్యాంగులను అవమానపర్చిన స్మితాసబర్వాల్ వ్యాఖ్యల వెనుక ప్రభుత్వ కుట్ర ఉన్నదని వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య అన్నారు. స్మితాసబర్వాల్ దివ్యాంగులపట్ల చేసిన వ్యాఖ్యలకు నిరసనగా బుధవారం ఇబ్రహీంపట్నంలో ఆమె దిష్టిబొమ్మను వీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో దహనం చేశారు. ఈ సందర్భంగా జంగయ్య మాట్లాడుతూ.. ఐఏఎస్ స్మితాసబర్వాల్ దివ్యాంగులను అవమానపరిచేలా సోషల్ మీడియాలో పోస్టులు చేయడం సరైంది కాదన్నారు. దివ్యాంగుల రిజర్వేషన్ గురించి మాట్లాడటమంటే రాజ్యాంగాన్ని కించపరిచినట్లేనని.. నిబంధనలు ఉల్లంఘించి మాట్లాడటం కోడ్ ఆఫ్ కండక్ట్ కిందికి వస్తుందని పేర్కొన్నారు. దివ్యాంగుల హక్కుల చట్టం ప్రకారం 2016 నియమ నిబంధనల ప్రకారం వ్యతిరేకంగా మాట్లాడటం సరైంది కాదని హెచ్చరించారు. మంగళవారం ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడిన మాటలతో స్మితాసబర్వాల్ చేసిన వ్యాఖ్యల వెనుక ప్రభుత్వ కుట్ర ఉన్నదని అర్థమవుతున్నదన్నారు. వెంటనే స్మితాసబర్వాల్ దివ్యాంగులకు క్షమాపణ చెప్పాలని.. లేదంటే అసెంబ్లీని ముట్టడిస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో దివ్యాంగుల సంఘం నాయకులు శ్రీనివాస్, రాజు, యాదయ్య, జంగయ్య, సలీం, సంజీవ ఉన్నారు.



కన్హాలో ధ్యానం చేస్తున్న మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ధ్యాన గురువు కమలేశ్ పటేల్

# ధ్యానంతోనే మానసిక ప్రశాంతత

- భారత మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్
- కన్హాలో ఘనంగా చారీజీ మహరాజ్ 97వ జయంతి వేడుకలు

నందిగామ, జూలై 24 : ధ్యానంతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని భారత మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ అన్నారు. నందిగామ మండలం కన్హా శాంతి వనంలో బుధవారం హార్ట్‌ఫుల్‌నెస్ ధ్యాన గురువులలో ఒకరైన చారీజీ మహరాజ్ (పార్థసారథి రాజగోపాలాచారి) 97వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రామ్‌నాథ్ కోవింద్ హాజరై హార్ట్‌ఫుల్‌నెస్ ధ్యాన గురువు కమలేశ్ పటేల్‌తో కలిసి ధ్యాన కేంద్రంలో ధ్యానం చేశారు. అనంతరం ధ్యాన గురువు కమలేశ్ పటేల్ రచించిన పుస్తకాలను అవిష్కరించారు. ఈ సందర్భంగా రామ్‌నాథ్ కోవింద్ ప్రపంచ శాంతి, ఆధ్యాత్మికత కోసం చారీజీ మహరాజ్ హార్ట్‌ఫుల్‌నెస్ ద్వారా చేసిన కృషిని కొనియాడారు. ఆయనతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. చారీజీ మహరాజ్ ద్వారా తాను చాలా విషయాలు తెలుసుకున్నట్లు పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ధ్యానం చేయడం ద్వారా గొప్ప అనుభూతిని పొందుతారని.. ధ్యానాన్ని జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో దేశవిదేశాల అభ్యాసకులు వేలాదిగా పాల్గొన్నారు.

# ఖర్చు ఘనం.. చెత్త పదిలం!

**గ్రేటర్‌లో ఎక్కడి వ్యర్థాలు అక్కడే ● అమలు కాని జీవీపీ పాయింట్ల ఎత్తివేత**



సికింద్రాబాద్ మేకల మండి

సిటీబ్యూరో, జూలై 24 (నమస్తే తెలంగాణ ) : గ్రేటర్‌లో పారిశుధ్య నిర్వహణ గాడి తప్పుతున్నది.. చెత్త రహిత నగరంగా తీర్చిదిద్దాల్సిన జీహెచ్‌ఎంసీ ఆమలులో పూర్తిగా విఫలం చెందుతున్నది. పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణ, వ్యాధుల నివారణకు ఏటా రూ.300 కోట్లకు పైగా ఖర్చు చేస్తున్నా.. లక్ష్యాన్ని మాత్రం సాధించలేకపోతున్నది. ఇంటింటికి తడి, పొడి చెత్త సేకరణ, తరచూ చెత్త వేసే ప్రాంతాల (గార్బేజీ వనరేబుల్ పాయింట్లు/జీవీపీ) ఎత్తివేతలో అధికారుల వైఫల్యం కొట్టొచ్చినట్లు కనబడుతున్నది. గ్రేటర్‌వ్యాప్తంగా చెత్త డబ్బాలను ఎత్తి వేయగా.. ఇప్పటికీ 2640 చోట్ల చెత్త కుప్పలున్నట్లు ఆస్కి (అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా) ఇటీవల నిర్వహించిన సర్వేలో తేల్చడమే అధికారుల పనితీరును ప్రశ్నిస్తున్నది. ఈ నేపథ్యంలోనే ఎక్కడా చూసినా పెద్ద పెద్ద చెత్త కుప్పలు దర్శనమిస్తున్నాయి. వ్యర్థాలతో నిండిపోయిన బస్తీలు, కాలనీలు వెరసి దోమలతో దవాఖానల్లో పెరుగుతున్న వ్యాధి పీడితులతో ప్రజల్లో ఆందోళన నెలకొన్నది. దీనికి కారణం అడుగడుగునా కొందరి అధికారుల అవినీతి లెక్కలు, రికార్డుల్లో తప్ప క్షేత్రస్థాయిలో కనిపించని సిబ్బంది.. కాగితాల్లో మాత్రమే కనిపించే చెత్త తరలింపు.. మేయర్, డిప్యూటీ మేయర్, కమిషనర్ మొదలుకొని డిప్యూటీ కమిషనర్ల వరకు ఆకస్మిక పర్యటనల లేమి వరకు లోపాలు కొట్టొచ్చినట్లు కనబడుతున్నాయి. ఒక్క వీఐపీలు ఉండే ప్రాంతాలు, ప్రధాన రహదారుల్లో మాత్రమే పారిశుధ్య నిర్వహణ మెరుగ్గా కనబడుతుందే తప్ప కాలనీలు, బస్తీల్లో చెత్త సేకరణ సక్రమంగా జరగడం లేదన్న విమర్శలు ఉన్నాయి.

### ఎక్కడ చూసినా చెత్త కుప్పలే దర్శనం

గ్రేటర్‌లో పారిశుధ్య నిర్వహణ గాడి తప్పుతున్నది..!! స్వచ్ఛ సర్వేక్షణ్-2024లో హైదరాబాద్ నగరాన్ని స్వచ్ఛతలో అగ్రస్థానంలో నిలుపుతామన్న లక్ష్యం నీరుగారుతున్నది. గడిచిన కొన్ని రోజులుగా ఎక్కడ చూసిన రహదారుల వెంట పేరుకుపోయిన చెత్త కుప్పలే దర్శనమిస్తున్నాయి. తరచూ చెత్త వేసే ప్రాంతాలు (గార్బేజీ వనరేబుల్ పాయింట్లు/జీవీపీ) జీహెచ్‌ఎంసీ పరిధిలో 2640 ప్రాంతాలను గుర్తించి వాటిని పూర్తి స్థాయిలో ఎత్తివేసేలా చర్యలు తీసుకుంటున్నామని చెబుతున్నారే తప్ప క్షేత్రస్థాయిలో వీటికి అదనంగా కొత్తగా జీవీపీ పాయింట్లు పుట్టుకొస్తున్నాయి. స్వచ్ఛ ఆటోల ద్వారా ఇంటింటికీ చెత్త సేకరణ సరిగా జరగడంలేదు. ఈ నేపథ్యంలోనే పారిశుధ్యంపై ఫిర్యాదులు అధికం కావడం, ఇటీవల హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో స్వయంగా మేయర్ గద్వాల్ విజయలక్ష్మి పారిశుధ్య నిర్వహణ ఏ మాత్రం బాగులేదని, తన డివిజన్‌లో చెత్త ఎత్తడం లేదని సంబంధిత అధికారులపై మండిపడడమే ఇందుకు నిదర్శనం. వాస్తవంగా వర్షాకాలంలో వ్యర్థాలు త్వరగా కుళ్లి దుర్గంధం వెదజల్లే పరిస్థితులు ఎక్కువ. దీన్ని చక్కదిద్దేందుకు చెత్తను ఎప్పటికప్పుడు తరలించేందుకు వర్షాకాలంలో ప్రత్యేక ఏర్పాట్లు చేయడం లేదు. వర్షాలొస్తే దోమలు, ఈగలు, క్రిమికీటకాలు వృద్ధి చెంది రోగాలు వ్యాపించే ప్రమాదం పొంచి ఉన్నది. ఇప్పటికే మలేరియా, డెంగీ కేసులు విజృంభిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే వర్షాకాలంలో పారిశుధ్య నిర్వహణకు మరింత మెరుగైన చర్యలు తీసుకోవాలని ప్రజలు వేడుకుంటున్నారు.

### స్వచ్ఛ ఆటోలపై పర్యవేక్షణ ఏదీ?

ఇంటింటికీ చెత్త సేకరణ లక్ష్యం అమలు కావడం లేదు. గ్రేటర్‌లో చెత్తరహిత నగరంగా తీర్చిదిద్దే చర్యల్లో భాగంగా దాదాపు మూడున్నరేండ్ల క్రితం డస్ట్ బిన్ లెస్ సిటీ పేరుతో చెత్త కుండీలను జీహెచ్‌ఎంసీ ఎత్తేసింది. మెరుగైన పారిశుధ్య నిర్వహణను పకడ్బందీ చేస్తూ వందకు వంద శాతం ఇంటింటికీ చెత్త సేకరణకు స్వచ్ఛ ఆటోల సంఖ్యను పెంచారు. సుమారు 5250 స్వచ్ఛ ఆటోల ద్వారా నగరంలో 4886 కాలనీల్లో 23 లక్షల గృహాల నుంచి రోజుకు 7వేల మెట్రిక్ టన్నులకు పైగా చెత్త సేకరణ జరగాలి. ఒక్కొక్క ఆటోకు కాలనీలవారీగా చూస్తే ఒకటి లేదా రెండు కాలనీలు గృహాల ప్రకారంగా గమనిస్తే ఒక్కొక్క అటోకు సుమారు 500 నుంచి 600 ఇండ్లను కేటాయించి, చెత్త సేకరణ జరపాలి. కానీ గడిచిన కొన్ని రోజులుగా స్వచ్ఛ ఆటోల పనితీరు సరిగా ఉండడం లేదు. చాలా కాలనీలకు రోజూ స్వచ్ఛ ఆటోలు రావడం లేదు. వందకు వంద శాతం స్వచ్ఛ ఆటోల అటెండెన్స్ ఉండడం లేదు. రోజూ 1000 స్వచ్ఛ ఆటోలు పనిచేయడం లేదని స్వయంగా గత కమిషనర్ రోనాల్డ్‌రోస్ గుర్తించారు. నేటికీ స్వచ్ఛ ఆటోల పనితీరుపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపించింది. దీంతో ఎక్కడి చెత్త అక్కడనే చెత్త కనబడుతున్నది. సమయపాలన పట్టించుకోకపోవడం, చెత్త సేకరణలో అధిక వసూళ్లకు తెరలేపడం, సిటీలో ఉండాల్సిన స్వచ్ఛ ఆటోలు గ్రేటర్ సరిహద్దులు దాటుతుండడం గమనార్హం. ఇదే విషయంపై ఇటీవల కొత్త కమిషనర్ ఆమ్రపాలి సైతం స్వచ్ఛ ఆటోల పనితీరు మెరుగుపర్చాలని, లేదంటే చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.



న్యూ అగాపురా



కవాడిగూడ గోశాల వెనుకవైపు



గాంధీ వైద్యశాల వెనకాల

**స్వచ్ఛ సర్వేక్షణ్-2023లో హైదరాబాద్ నగరాన్ని స్వచ్ఛతలో అగ్రస్థానంలో నిలుపడమే లక్ష్యంగా కేసీఆర్ ప్రభుత్వం చర్యలు చేపట్టి మెరుగైన ర్యాంకులను సాధించింది. స్వచ్ఛ హైదరాబాద్‌లో భాగంగా తడి, పొడి చెత్త వేర్వేరు, ఇంటింటికీ చెత్త సేకరణ.. కాలనీ, బస్తీ సంక్షేమ సంఘాల భాగస్వామ్యం, ఓడీఎఫ్‌కు చర్యలు, బహిరంగ మలమూత్ర విసర్జన నివారణ చర్యలు, స్వచ్ఛతపై చైతన్య కార్యక్రమాలు, 50 మైక్రాన్ల కన్నా తక్కువ నిడివి ఉన్న ప్లాస్టిక్ నిషేధం వంటి కార్యక్రమాలు పక్కాగా చేపట్టింది. ప్రధానంగా చెత్తకుండీలు లేని నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దే క్రమంలో దాదాపు 22 లక్షల గృహాలకు ఒక్కో ఇంటికి తడి, పొడి చెత్త సేకరణకు 44 లక్షల చెత్త బుట్టలను పంపిణీ చేశారు. ఇంటింటికీ చెత్త సేకరణకు 4500 స్వచ్ఛ ఆటో టిప్పర్లను వినియోగించారు. ట్రాన్స్‌ఫర్ స్టేషన్లు, ఆధునిక వాహనాల వినియోగంతో వెరసి జీహెచ్‌ఎంసీకి ' బెస్ట్ సెల్ఫ్ సస్టైనబులిటీ అవార్డు, 3 స్టార్ రేటింగ్ సిటీగా నిలిపింది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత చెత్త నిర్వహణలో పూర్తిగా గాడి తప్పిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.**



మణికొండ ఓయూ కాలనీలో